


**నైజాం** నవాబు పానగల్లు దగ్గర చెరువుకట్ట పోయించాలని నిర్ణయించాడు.

దేశంలో వున్న వడ్డెర్లనందరినీ పిలిపించి, కట్ట నిర్మాణం గురించి చెప్పాడు.

'తూమెడు' వెండి రూపాయలకు వడ్డెర్లు కట్టపోసేటట్లు రాజు ఒప్పందం కుదుర్చుకున్నాడు.

వడ్డెర్లు తట్టా బుట్టా సర్దుకుని, గుడిసెలు వేసుకుని, ఎండాకాలం కరువులో కట్ట నిర్మాణానికి పూనుకున్నారు.

ఒక నెలా రెండు నెల్లా! 'మూణ్ణెల్ల పట్ట పగలు'కు కట్ట నిర్మాణం పూర్తయింది.

నవాబుగారు వచ్చి చూసి, భేష్! అన్నారు.

'డబ్బు' గురించి అడిగారు వడ్డెర్లు.

రాజు పిసుక్కు చస్తున్నాడు. వడ్డెర్లకు డబ్బు ఎలా యివ్వడమా అని? ఖజానాలో డబ్బు వున్నది కానీ యివ్వ బుద్ధి కావడం లేదు. మరెలా?!

దారిలో ఓ గొల్లవాడు గొర్రు జీవాలను మేపుతూ కనిపించాడు రాజుగారికి!

రాజుగారు గొల్లవాణ్ణి 'ఏయ్' ఎవరా పోయేదని కేక వేశేడు.

గొల్లవాడు ఈ అడవిలో తననెవరు కేక వేస్తున్నారు అని పారచూసి... ఓహో రాజుగారా! అనుకుని దగ్గరకి వచ్చాడు.

'రాజా! ఎందుకిలా దిగులుగా వున్నావు' అని అడిగాడు.

ఏం చేయమంటావ్ గొల్లోడా! తూమెడు వెండి రూపాయలిస్తానని వడ్డెర్లకు మాటిచ్చి పానగల్లు చెరువుకట్ట పోయించిన. వాళ్లేమో డబ్బులడుగుతున్రు. నా దగ్గర డబ్బు లేదు. ఏం చేయాలో తోచక నిన్ను పిల్చిన.

గొల్లవాడన్నాడు, ఓస్ యింతేనా! దీనికేనా యింత దిగులు, తూమెడు రూపాయలే కదా వాళ్లకిచ్చేది. ఏ తూమెడైతేనేం ఈ తూమెడు డబ్బులిచ్చి వంపమని తన గొడ్డలి కర్ర పీకి గొడ్డలి తూము చూపించాడు. పిసినారి రాజుకు ఈ ఉపాయం బాగానే అనిపించింది. భలే! భలే! అనిగూడా అనిపించింది. 'గొడ్డలి తూము'లో ఎన్ని రూపాయలు పడతాయి. మా అంటే పదో పన్నెండో అంతే!

వడ్డెర్లను పిలిపించాడు రాజు-

మీ కూలి బాపతు రూపాయలు తీసుకోమన్నాడు.

కొలిపించమన్నారు కూలీలు.

తూమెడు రూపాయలు కదా కొలవాల్సింది, గొడ్డలి అక్కడపెట్టి గొడ్డలి తూములో రూపాయలు పోశాడు రాజుగారు.

చూస్తున్న వడ్డెర్లు నిర్విణ్ణులయ్యారు.

తీసుకోమన్నారు. చూస్తున్న వడ్డెర్లు మరోమారు నిశ్చేష్టులయ్యారు. ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. కళ్లల్లో నీరు నింపుకున్నారు. చేతి పిడికిళ్లు బిగుసుకున్నాయి. రాజుగారిని ఏమీ చేయలేక కండ్ల నీరు కుక్కుకుంటూ, మౌనంగా రాజుగారిని, చెరువునీ శాపనార్తాలు పెట్టారు. ఎన్నడూ, ఎప్పుడూ పానగల్లు చెరువు నిండకూడదనీ! అంతే!

అందరూ వెళ్లిపోయారు పానగల్లులో వున్న పచ్చల సోమేశ్వరాలయానికి పడమటి దిక్కుకు. అక్కడే పానగల్లులో స్థిరపడిపోయారు. ఇప్పుడక్కడున్న వడ్డెర్లందరూ వారి వారసులే!

అప్పటికీ యిప్పటికీ పానగల్ చెరువు నిండనే లేదు. అందుకు కారణం వడ్డెర్ల 'శాపనార్థమే'అంటారు.

**ముక్తాయింపు:** ప్రపంచ బ్యాంక్ సహకారంతో కోట్లకొద్దీ రూపాయలు ఆ నీరులేని చెరువుపై మన ప్రభుత్వం వెచ్చిస్తోంది. హైదరాబాద్, సికిందరాబాద్ ఎలా కల్సిపోయాయో, నల్లగొండ పానగల్లు అలా కలిసిపోయాయి. ■